# పర్యావరణ ఆత్యయిక పరిస్థితి

Disclaimer: we collected these articles from Internet part of Social Awareness Campaign, we are thankful to the creators. We use for non-profit, free education purpose only. To know more, please visit: www.freegurukul.org

చీకూ చింతా లేని మానవ మనుగడకు పర్యావరణ పరిరక్షణ అత్యంత ప్రాణప్రదం. ఆ మౌలిక స్పృహ కొరవడినచోట్ల తీవ్ర అనర్థాలు అనివార్యం! ఘనవ్యర్థాల నిర్వహణపై వివిధ రాష్ట్రప్రభుత్వాల ప్రధాన కార్యదర్శులతో జాతీయ హరిత ట్రైబ్యునల్ (ఎన్‌జీటీ) జరుపుతున్న వరస భేటీల్లో పర్యావరణానికి సంబంధించి ఇతరత్రా ఆందోళనకర అంశాలూ తెరపైకి వస్తున్నాయి. కలుషిత విధివిధానాల్ని తూష్ణీకరించిన ధర్మాసనం మాటల్లో- నేడు దేశంలో పర్యావరణ ఆత్యయిక పరిస్థితి నెలకొంది! ప్రమాదకర స్థాయికి చేరిన జల కాలుష్యాన్ని, కృష్ణానదిలో విచ్చలవిడి ఇసుక తవ్వకాల్ని ఇటీవల సూటిగా తప్పుపట్టిన ట్రైబ్యునల్, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వానికి రూ.100కోట్ల జరిమానా విధించింది. ఇప్పుడది తాజాగా తెలంగాణ సర్కారును బోనులో నిలబెట్టింది. ఇసుక తవ్వకాలు, మూసీ కాలుష్యం, ప్లాస్టిక్ వ్యర్థాలపై ప్రశ్నల పరంపరతో ఉక్కిరిబిక్కిరి చేసిన ఎన్‌జీటీ- అక్రమ మైనింగ్ నియంత్రణకోసం పకడ్బందీ చర్యలు చేపట్టాల్సిందిగా తెలంగాణకు నిర్దేశించింది. పర్యావరణానికి హాని వాటిల్లజేసేవారిని భయపెట్టేలా జరిమానాలు వడ్డించాలని వారంక్రితం ఏపీ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శికి గిరిగీసిన ఎన్‌జీటీ, పెనుముప్పు సంకేతాల్ని కళ్లకు కట్టింది. కర్నూలులో తుంగభద్రలోకి మురుగునీరు యథేచ్ఛగా పారుతోంది. కొల్లేరు సరస్సులో 14రకాల హానికారక క్రిములున్నాయి. విశాఖలో వ్యర్థాలెన్నో సాగర గర్భానికి చేరుతున్నాయి. తెలంగాణలో టీఎస్-ఐపాస్ కింద అనుమతులు పొందిన పరిశ్రమల్లో మూడొంతులదాకా కాలుష్య కారకాలేనని, భాగ్యనగర బాహ్య వలయ రహదారి (ఓఆర్ఆర్) వద్ద రసాయన వ్యర్థాల్ని పెద్దయెత్తున దిమ్మరిస్తున్నారన్న కథనాలు భయాందోళనలు పుట్టిస్తున్నాయి. ఎంచి చూస్తే మంచమంతా కంతలేనన్న సామెత చందంగా పర్యావరణ విధ్వంసం కొనసాగుతున్న నేపథ్యంలో- కాలుష్యం కారణంగా మరణం హత్యతో సమానమన్న ఎన్‌జీటీ హితవాక్యం, ఉభయరాష్ట్రాలూ విస్మరించరానిది!

అక్రమ మైనింగ్ ఘాతుకాల పరంపర ఏ రెండు, మూడు రాష్ట్రాలకో పరిమితమైన ఉత్పాతం కాదు. నదులు, చెరువులు, కుంటలు, పట్టాభూములు, శ్మశానాలు... ఎక్కడా దేన్నీ వదిలిపెట్టకుండా నీటివనరులున్న ప్రతి గ్రామానా ఇసుకను పిండేసి కోట్ల రూపాయలు దండుకుంటున్న ముష్కరులు- దేశ భవిష్యత్తునే తవ్వేస్తున్నారు. అక్రమ బొగ్గు తవ్వకాల్ని నియంత్రించడంలో ఘోరంగా విఫలమైందంటూ మేఘాలయకు జాతీయ హరిత ట్రైబ్యునల్ ఇటీవలే రూ.100కోట్ల జరిమానా విధించింది. పలు పారిశ్రామిక విభాగాల్ని దారికి తేవడంలో, వాయుకాలుష్యాన్ని కట్టడి చేయడంలో చతికిలపడిందంటూ దిల్లీ ప్రభుత్వానికీ రూ.50కోట్ల మేర అపరాధ రుసుం వడ్డించింది. పరిశ్రమలకు స్థలాలు, ఇతరత్రా వసతులు కేటాయించేటప్పుడు కాలుష్య వ్యర్థాల విసర్జన ఏర్పాట్లపై యోచించాల్సిందేనని అయిదు రోజులక్రితం యూపీ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శికి ట్రైబ్యునల్ గట్టిగా తలంటేసింది. పారిశుధ్య అవ్యవస్థను వేలెత్తి చూపుతూ లూధియానా పురపాలక సంఘం, పంజాబ్ కాలుష్య నియంత్రణ బోర్డుల పనితీరును ఎన్‌జీటీ మండలి సరికొత్తగా తూర్పారపట్టింది. ప్రజారోగ్యం, పర్యావరణాల పరిరక్షణ పట్ల నిబద్ధత కలిగిన ఏ అధికార యంత్రాంగమైనా నిష్ఠగా పూడ్చాల్సిన కంతలే ఇవన్నీ. జాతీయ హరిత ట్రైబ్యునల్ ఆక్షేపించేదాకా, ఆ తరవాతా కాలుష్యం పెచ్చరిల్లుతూనే ఉండటం- అధికార యంత్రాంగంలో మేరమీరిన అలసత్వానికే తార్కాణం. జీవావరణ ప్రాతిపదికన సున్నిత ప్రాంతాలుగా గుర్తించినచోట్ల ఖనిజ, ఇసుప తవ్వకాలు, క్వారీ పనులు, థర్మల్ విద్యుత్ కేంద్రాల నిర్మాణాలపై ఆంక్షలు విధించడం అహేతుకమని కర్ణాటక వంటి రాష్ట్రాలు గర్జిస్తున్నాయి. వర్తమానంలో అభివృద్ధి పేరిట తలపెట్టే ఏ కార్యకలాపాలైనా భవిష్యత్తును బుగ్గిపాలు చేయకూడదు. ఆ మేరకు దేశం నలుమూలలా పర్యావరణ స్పృహ పొంగులు వారనంతవరకు, ఆత్మహత్యాసదృశ వినాశం ఆగదు!

'ఫొని' భీకర తుపాను ముప్పు భయం ఇప్పుడు ఉత్తరాంధ్ర వాసుల్ని హడలెత్తిస్తోంది. దీనికి ముందు తెలుగు గడ్డపై విరుచుకుపడిన పెథాయ్ తుపాను, నిరుడు దేశాన్ని కలవరపరచిన సాగర్, మెకును, లూబాన్, దాయె, తిత్లీ తదితరాలకు భూతాపం పెరుగుదల, వాతావరణ మార్పులే ప్రధాన కారణాలంటున్నారు. కేంద్ర జలసంఘం మదింపు ప్రకారమే, ప్రపంచంలో వరదల ముంపు మూలాన నమోదయ్యే మరణాల్లో అయిదోవంతు దాకా భారత్‌లోనే చోటు చేసుకుంటున్నాయి. లోతట్టు ప్రాంతాల మునక, పంట దిగుబడుల

క్షీణతలన్నవి అంతులేని కథ. తెలుగునేలపై ఉపరితల భూగర్భ జలవనరుల్ని పరిరక్షించి, ఇసుక తవ్వకాల్ని నియంత్రించి, పర్యావరణాన్ని కాపాడేందుకు ఉద్దేశించిన 2002నాటి 'వాల్టా' చట్టం దస్త్రాల్లో నిరవధిక విశ్రాంతి తీసుకుంటోంది. దశాబ్దాలుగా అరడజను ప్రత్యేక శాసనాలు అమలులో ఉన్నప్పటికీ, 180 దేశాల పర్యావరణ పనితీరు సూచీలో ఇండియా 177వ స్థానాన అలమటిస్తోంది. ఈ దుస్థితికి విరుగుడేమిటో టీఎస్ఆర్ సుబ్రమణియన్ కమిటీ వివరణాత్మకంగా సూచించింది. కేంద్ర, రాష్ట్ర స్థాయుల్లో పర్యావరణ నిర్వహణ ప్రాధికార సంస్థల్ని నెలకొల్పి, కాలుష్య నియంత్రణ మండళ్లను వాటిలో విలీనం చేయాలన్నది కమిటీ సిఫార్సు. పర్యావరణ పటాన్ని రూపొందించి దేశంలో ఎక్కడ పరిశ్రమలు అవతరింపజేయగల వీలుందో, మరెక్కడ కుదరదో నిర్ధారించాలనీ అది సూచించింది. ఇసుక తవ్వకాలు, అడవుల నరికివేత, పారిశ్రామిక కాలుష్యం వంటి కీలకాంశాలకు సంబంధించి సంకుచిత రాజకీయ రాగద్వేషాలకు, అనుచిత జోక్యానికి తావులేని రీతిలో జాతీయ అజెండా కచ్చితంగా అమలు జరిగే వాతావరణ పరికల్పన ఒక్కటే- జాతి సుస్థిర భవితకు భరోసా. కాలుష్య నియంత్రణ, అటవీ ఆచ్ఛాదన పెంపు జీవన సంస్కృతిలో అంతర్భాగమయ్యేలా చూస్తున్న నార్వే, స్వీడన్ ప్రభృత దేశాల పటిష్ఠ కార్యాచరణే పరిశుభ్ర భారతావనికి అడుగుజాడ!